

## కేడీసీసీబీలో ఇంకా 26,337 మందికి రాలే..

₹లక్ష వరకు రైతులు తీసుకున్న రుణం మాఫీ చేసినట్టుగా ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. కానీ, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోనే లక్షలాది మంది పేర్లు రుణమాఫీలో గల్లంతయ్యాయి. ఈ విషయాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. జిల్లా సహకార బ్యాంకు పరిధిలో మొత్తం 130 ప్రాథమిక సహకార వ్యవసాయ పరపతి సంఘాలున్నాయి. వీటి పరిధిలో 58,577 మంది రైతులు లక్ష వరకు రుణం తీసుకున్నారు. వీరు తీసుకున్న మొత్తం ₹165.88 కోట్లు. నిజానికి వీరంతా ₹లక్ష రుణమాఫీకి అర్హులు. కానీ, తాజాగా 32,240 మందికి మాత్రమే మాఫీ అయింది. ఇంకా 26,337 మందికి మాఫీ కా వాల్సింది. వీరికి మాఫీ అవుతుందా..? లేదా..? అన్నదానిపై ఎవరి వద్దా స్పష్టత లేదు. అందులోనూ కొన్ని సహకార సంఘా ల పరిధిలో ఒక్క రైతుకు కూడా మాఫీ కాకపోవం గమనార్హం.

# మాఫీ.. మాయ!

## రుణమాఫీ.. అంతా సినిమా సిత్రం

- గందరగోళంగా ప్రక్రియ
- ₹రెండు లక్షల రుణగ్రహీతలకు ₹మూడు వేల మాఫీ?
- ఒక కుటుంబంలో ఒక్కరికే అమలు
- వ్యవసాయ విస్తరణాధికారులకు లాగిన్
- సమాధానం చెప్పలేక సతమతం
- పోర్టల్‌లో రకరకాల కారణాలతో రిజెక్ట్
- అర్థంకాక తలలు పట్టుకుంటున్న అధికారులు
- ప్రభుత్వం తీరుపై మండిపడుతున్న రైతులు

**రుణమాఫీ ప్రక్రియ అంతా సినిమా సిత్రాలను తలపిస్తున్నది. పక్కా లెక్కలు, విధివిధానాలు లేకుండా మాఫీ మాయలా మారింది. మొదటి విడతలో ₹లక్ష లోపు మాఫీ చేస్తున్నామని విస్తృత ప్రచారం చేసినా.. క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి ముక్కున వేలేసుకునేలా ఉన్నది. ₹25 వేల రుణం తీసుకున్న రైతులకు కాని మాఫీ.. ₹రెండు లక్షల పైచిలుకు రుణగ్రహీతలకు ₹రెండు వేలు లేదా ₹మూడు వేలు మాఫీ అయినట్టు మెస్సేజ్‌లు రావడం విస్మయం కలిగిస్తున్నది. మరోవైపు ఒక కుటుంబంలో నలుగురు అన్నదమ్ములుంటే.. ఒక్కరికి మాత్రమే మాఫీ అయింది. ఈ పథకానికి ఏ నిబంధనలు అమలు చేశారో.. ఎందుకు లక్షలాది మందికి రాలేదో అర్థంకాని పరిస్థితి నెలకొన్నది. వ్యవసాయ విస్తరణ అధికారులకు రుణమాఫీ పోర్టల్ లాగిన్ అవకాశం ఇవ్వగా, అది చూస్తే రకరకాల కారణాల వల్ల మాఫీ కానట్టు చూపుతున్నది. దీంతో మాఫీ జరగని రైతులు తిరిగి ఎలా క్లెయిమ్ చేసుకోవాలన్న దానిపై ఇప్పటి వరకు లిఖిత పూర్వక ఆదేశాలు రాకపోవడంతో అధికారులు సతమతమవుతున్నారు. మౌఖిక ఆదేశాలు ఒక్కో రకంగా వస్తుండడంతో తలలు పట్టుకుంటున్నారు. ఇటు రైతులు కూడా దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు.**



కరీంనగర్, జూలై 20 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : రుణ మాఫీకి అసలు ఏ నిబంధనలు వర్తింపజేశారో అర్థం కాని పరిస్థితి ఉన్నది. ఉమ్మడి జిల్లాలో ₹రెండు లక్షల పైచిలుకు ఉన్న కొంత మందికి ₹రెండు వేల నుంచి ₹మూడు వేలు మాఫీ అయినట్టు మెస్సేజ్‌లు రావడం ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నది. అలాగే ₹లక్షకు పైబడి ఉన్న వారిలో కొంత మందికి ఇదే తరహా మెస్సేజ్‌లు వచ్చాయి. నిబంధనల ప్రకారం చూస్తే ₹లక్ష వరకు ఉన్న రైతులకు మాత్రమే రుణమాఫీ జరిగినట్టు ప్రభుత్వం చెబుతున్నది. అలాంటప్పుడు ఆ పై రుణం ఉన్న వారికి మాఫీ అయినట్టు మెస్సేజ్‌లు రావడంపై ఎవరి వద్దా స్పష్టత లేదు. దీంతో పాటు లక్షల మంది పేర్లు జాబితాలో గల్లంతయ్యాయి. బ్యాంకుల వద్దకు వెళ్లి అడిగితే.. వ్యవసాయ విస్తరణాధికారులు (ఏఈవో)లను అడగాలని చెబుతున్నారు. ప్రభుత్వం ఏఈవోలకు లాగిన్ ఇచ్చింది. వారు దానిని ఓపెన్ చేసి చూస్తే.. అందులో ఒక్కొక్కరికీ ఒక్కోరకంగా చూపిస్తున్నాయి. కొంతమందికి టెక్నికల్ ఎర్రర్ అని, మరికొంత మందికి కుటుంబ సభ్యుల గురించి విచారణ చేయాలని, మరికొంత మందివి ఆధార్‌కార్డు లింకు లేదని, ఇంకొంతమందికి కారణాలు ఏమీ లేకుండా ఖాళీగా కనిపిస్తున్నాయి. అంటే ఒక్కొక్కరిది ఒక్కో కారణం చెబుతున్నా.. దానికి పరిష్కారం ఏమిటన్నది మాత్రం అధికారులు చెప్పడం లేదు. వారి వద్ద కూడా సమాధానం లేదు. అంతే కాదు, రుణమాఫీ వర్తించని రైతులకు ఎలా న్యాయం చేస్తారు? వారు ఏమైనా మళ్లీ పత్రాలు సమర్పించాలా..? లేక బ్యాంకులకు వెళ్లాలా..? లేక గ్రామస్థాయిలో అధికారులను కలువాలా..? అన్నదానిపై ఎక్కడా స్పష్టత లేదు. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మెజార్టీ గ్రామాల్లో 40 శాతం మంది రైతులకు మాఫీ జరిగితే.. ఇంకా 60 శాతం మంది అధికారులు చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. మొత్తంగా చూస్తే.. సోమవారం వరకు కొంత మేరకైనా క్లారిటీ వచ్చే అవకాశం ఉందని రైతులకు అధికారులు సర్ది చెబుతున్నారు. ఏది ఏమైనా రైతుల నుంచి వ్యక్తమవుతున్న ప్రశ్నలకు అధికారులు సమాధానాలు చెప్పలేని పరిస్థితిలో కొట్టు మిట్టాడుతున్నారు.

### నా భార్య పేర అప్పు లేకున్నా ఉందన్నరు.. అందుకే నాకు మాఫీ కాలేదట!



నేను గతేడాది జూలైల హుజూరాబాద్ యూనియన్ బ్యాంకుల రెండెకరాల వ్యవసాయ భూమి కుదువ పెట్టి ₹92 వేలు రుణం తీసుకున్న. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చెప్పినట్టు 2023 డిసెంబర్ 9 తేదీలోపు తీసుకున్న వ్యవసాయ రుణమాఫీ పథకంల నా అప్పు మాఫీ కాలే. లిస్టల నా పేరు లేకపోవడంతో బ్యాంకుకు వెళ్లి అడిగితే ఇక్కడ ఏమీ ఉండదని చెప్పిన్రు. దీంతోకేసీ క్యాంపులోని రైతువేదిక దగ్గరికి వెళ్లి ఏఈవోను అడిగితే ఓపిగ్గా పరిశీలించిన్రు. నా భార్య రమ పేర ₹97 వేల అప్పు ఉందని, అందుకే మాఫీ కాలేదు కావచ్చని సమాధానం చెప్పిన్రు. నా భార్య పేరు మీద గుంట భూమి కూడా లేదు. అలాంటప్పుడు అప్పు ఎలా ఇస్తరు.. లేని అప్పును ఉన్నట్లు చూపెట్టడంతో నాకు రుణమాఫీ కాలె.

**- గూడూరి రవీందర్‌రెడ్డి, ఇప్పల్ నర్సింగాపూర్ (హుజూరాబాద్ మండలం)**

### నేనెందుకు అర్హున్ని కాదు?



గతంలో కేసీఆర్ ప్రభుత్వం చేసినట్టే అందరికీ రుణమాఫీ చేయాలి. ఈ ప్రభుత్వం చెప్పిన డేట్‌లోపే నేను ఎస్‌బీఐలో క్రాప్ లోన్ కోసం అప్లై చేసుకున్న. కానీ, బ్యాంకులో టెక్నికల్ ఇష్యూతో రెండు రోజులు ఆలస్యం కావడంతో నేను అర్హున్ని కాదట. ఇదేంది అసలు. మాఫీ అంటే అందరికీ చేయాలి. కానీ, ఇలా కొర్రీలు పెట్టి ఎంతో మందిని అనర్హులుగా చేసి డిస్సప్పాయింట్ చేసింది రేవంత్‌రెడ్డి ప్రభుత్వం. నేనెందుకు అర్హున్ని కాదో చెప్పాలి. ఇప్పుడు నా లోన్ బ్యాంకు వాళ్లు మాఫీ చేస్తరా.. ప్రభుత్వం చేస్తదా?

**- కాలువ తిరుపతి, గుండ్లపల్లి (తిమ్మాపూర్)**

### మాఫీ ఎందుకు కాలేదో



నాకు ఎకరానికి పైగా ఎవుసం భూమి ఉన్నది. 2021లో మంథని తెలంగాణ గ్రామీణ బ్యాంకులో ₹40వేల లోన్ తీసుకున్న. ఏడాదికోసారి రెన్యువల్ చేయిస్తున్న. ప్రభుత్వం మొన్న రుణమాఫీ చేసిందని తెలుసుకుని సంతోషపడ్డ. కానీ, రుణమాఫీ లిస్ట్ చూస్తే నా పేరులేదు. నాకు కిసాన్ పథకం కింద ఏడాదికి ₹6వేలు వస్తున్నయి. లోన్‌మాఫీ కోసం ప్రభుత్వం పెట్టిన రూల్స్‌కు లోబడే ఉన్న. అయినా మాఫీ ఎందుకు కాలేదో అర్థమయితలేదు. అధికారులను అడిగితే రెండురోజుల్లో చెప్తమంటున్నరు.

**- తెలుసూరి స్వప్న, రైతు, బిట్టుపల్లి (మంథని)**

### మా నాన్న పేరిట లోన్ అట్లనే ఉన్నది



మాది ఎక్లాస్‌పూర్. మా నాన్న 2017లో కేడీసీసీ బ్యాంకులో ఎకరం పొలానికి ₹30వేల లోన్ తీసుకున్నడు. 2018లో ఆయన జరిగిపోయిన తర్వాత ఏడాదికోసారి మిత్తి కడుతూ రెన్యువల్ చేయిస్తున్నం. అయినా ప్రభుత్వం విడుదల చేసిన రుణమాఫీ లిస్టల మా నాన్న పేరు లేదు. బ్యాంకుకు వెళ్లి అడిగితే మా చేతిలో ఏమీలేదని అంటున్నరు. టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్‌జేస్తే నోట్ చేసుకున్నమని చెప్పి కట్ చేసిన్రు. సీఎం సారేమో లక్ష మాఫీ చేసినమంటున్నడు. మరీ మాదేందుకు కాలేదు.

**- ఎడ్ల శ్రీనివాస్, ఎక్లాస్‌పూర్ (మంథని మండలం)**



### కేసీఆర్ అందరికీ మాఫీ చేసిండు



నాకు మూడెకరాల భూమి ఉంది. 2018లో ₹99 వేల క్రాప్‌లోన్ తీసుకున్న. ఎప్పటికప్పుడు రెన్యూవల్ చేసుకుంటూ వస్తున్న. సర్కారు చేసిన రుణమాఫీ లిస్టుల నాపేరే లేదు. మాఫీ అయిద్దో లేదో? కూడా తెల్వదు. కేసీఆర్ హయాంలో రుణమాఫీకి ఎలాంటి కొర్రీలు పెట్టలేదు. కటాఫ్ డేట్ అంటూ లేకుండా మాఫీ చేసిండు. అధికారంలోకి రాకముందు రైతులందరికీ రూ.రెండు లక్షల రుణమాఫీ అన్నరు. ఇప్పుడేమో కటాఫ్ డేట్ అంటూ చెప్పి తప్పించుకుంటున్నరు. కొందరికే ఇచ్చి అందరికీ ఇచ్చినట్టు చెప్పుకునేందుకే ఈ నాటకం. ఇత్తే అందరికీ ఇయ్యాలె. మేం రైతులం కాదా..? కాంగ్రెస్ సర్కారు వచ్చినంక బతుకులు మారుతయనుకున్నం. కరెంటే సక్కగుంటలేదు. ఎవుసం ఎట్ల నడుత్తదో? మళ్ల పొలాల కాడ కావలి కాసుడే అయితదేమో ? సూత్తుంటే భయమేస్తుంది.

**- ల్యాగాల బాగయ్య, రైతు (పెద్దూరు)**

### నర్సయ్యకు నిరాశే



.. ఇతని పేరు గోనె నర్సయ్య. గోపాల్‌పూర్‌కు చెందిన ఇతను దుర్శేడ్ సింగిల్ విండో వైస్ చైర్మన్ కూడా. కేడీసీసీబీ నుంచి రెగ్యులర్‌గా రుణం తీసుకుంటారు. క్రమం తప్పకుండా రెన్యువల్ కూడా చేయించుకుంటారు. ఈసారి కూడా తన అర్హతను బట్టి ₹99 వేల రుణం తీసుకున్నాడు. మాఫీ కోసం ఎదురు చూడకుండా మే నెలలో ₹3,700 వడ్డీతో కలిపి తీసుకున్న మొత్తం చెల్లించి లోన్ రెన్యూవల్ చేయించుకున్నారు. అయితే, అతను తీసుకున్న ₹99 వేలకు రెండు నెలల్లో నామ మాత్రపు వడ్డీ మాత్రమే అవుతుంది. అసలు, వడ్డీ కలుపుకుని ₹లక్ష దాటే అవకాశం ఉండదు. కానీ, రుణమాఫీ జాబితాలో పేరు లేక పోవడంతో నర్సయ్యకు నిరాశే మిగిలింది. ఆయనలాగే అనేక మంది రైతుల పేర్లు జాబితాలో రాకపోవడంతో గ్రామంలో ఏ రైతును కదిలించినా తీవ్ర అసంతృప్తే వ్యక్తమైంది.



నంచర్ల సహకార సంఘ కార్యాలయం

## పెగడపల్లిలో 890 మంది పేర్లు గల్లంతు

పెగడపల్లి, జూలై 20: రుణమాఫీ విచిత్రంగా జరుగుతున్నది. రూ.లక్షలోపు రుణాల జాబితాలో వందలాది మంది పేర్లు గల్లంతయ్యాయి. పెగడపల్లి, నంచర్ల, నందగిరి ప్రాథమిక సహకార సంఘాల పరిధిలో రూ.లక్ష లోపు రుణాలు తీసుకున్నవారు 1540 మంది ఉండగా, అందులో సగం మందికి మాఫీ కాలేదు. పెగడపల్లి సంఘంలో 714 మంది రైతులుంటే కేవలం 156 మందికి మాత్రమే మాఫీ జరిగింది. 558 మంది రైతుల పేర్లు గల్లంతయ్యాయి. నంచర్ల సంఘంలో 613 మందికి 368 మందికి మాత్రమే లబ్ధి కలిగింది. ఇక నందగిరి సంఘంలో 213 మందికి 126 మందికి మాత్రమే మాఫీ జరిగింది. మొత్తంగా మూడు సంఘాల పరిధిలో 890 మంది పేర్లు గల్లంతయ్యాయి. రైతులు సహకార సంఘాల సిబ్బందిని సంప్రదిస్తే, తాము అందరి పేర్లు పంపించామని, వివరాలు తమకు కూడా పూర్తిగా తెలియదని చెబుతున్నారని రైతులు వాపోతున్నారు.



కరీంనగర్ రూరల్ మండలం గోపాల్‌పూర్‌లోని హనుమాన్ ఆలయంలో రుణమాఫీపై చర్చించుకుంటున్న రైతులు

# ఆ ఊళ్లో 26 మందికే..

- ఒక్క కేడీసీసీబీ బ్యాంకులోనే 225 మందికి పైగా రుణాలు
- రూ.లక్ష లోపు తీసుకున్నది సుమారు 150 మంది
- మాఫీ అయ్యింది మాత్రం కొందరికే..
- కరీంనగర్ మండలం గోపాల్‌పూర్‌లో రైతుల అసంతృప్తి

కరీంనగర్, జూలై 20 (నమస్తే తెలంగాణ) : కరీంనగర్ రూరల్ మండలం గోపాల్‌పూర్‌లో సుమారు 500కుపైగా రైతులు ఉంటారు. కూరగాయల సాగుకు పెట్టింది పేరుగా ఉన్న ఈ గ్రామంలో రైతులు ప్రతీసారి పంట రుణాలు తీసుకుంటారు. క్రమం తప్పకుండా చెల్లిస్తుంటారు. ఎక్కువ మంది దుర్శేడ్ సింగిల్ విండో పరిధిలోని కేడీసీసీ బ్యాంక్‌లోనే పంట రుణాలు, దక్కన్ గ్రామీణ బ్యాంకు, తదితర బ్యాంకుల్లో తక్కువ మంది రుణం తీసుకుంటారు. అయితే, గోపాల్‌పూర్ సింగిల్ విండో పరిధిలో మొత్తం దుర్శేడ్, గోపాల్‌పూర్, ఇరుకుల్ల, మొగ్దుంపూర్, చేగుర్తి, నల్లగుంటపల్లి గ్రామాల్లో 800 మంది పంట రుణాలు తీసుకున్న రైతులు ఉన్నారు. ఇందులో రూ.లక్ష రుణం తీసుకున్న వారు 411 మంది ఉన్నారు. ఇక ఇదే సింగిల్ విండో పరిధిలోని గోపాల్‌పూర్ విషయానికి వస్తే ఈ ఒక్క గ్రామంలోనే రుణాలు తీసుకున్న రైతులు 225 మంది ఉన్నారు. ₹లక్ష వరకు రుణం తీసుకున్న రైతులు సుమారు 150 మంది ఉంటే వీరిలో కేవలం 26 మందికి మాత్రమే మాఫీ జరిగింది. ఈ గ్రామంలో చాలా మంది చిన్న సన్న కారు రైతులే ఉన్నారు. వీరిలో అర్హతను బట్టి ₹40 వేల నుంచి ₹60 వేల వరకు తీసుకున్న రైతులే ఎక్కువగా ఉన్నారు. అయితే, వీరిలో చాలా మంది రుణమాఫీకి అర్హులే. కానీ, జాబితాలో మాత్రం కేవలం 26 మంది పేర్లు మాత్రమే రావడంతో గ్రామంలోని రైతులు గందరగోళంలో పడ్డారు. అసలు మాకు రుణమాఫీ వర్తిస్తుందా? లేదా? అనే మీమాంసలో పడిపోయారు. ఒక ఇంటిలో ఇద్దరి పేర్లపై రుణం తీసుకుంటే కొందరికి వచ్చింది. అనేక మందికి రుణమాఫీ కానేలేదు. దీంతో గ్రామంలో ఎవరెవరికి వచ్చింది? ఎవరికి రాలేదనే విషయమై ఇపుడు ఎక్కడ చూసినా చర్చ జరుగుతున్నది.

## మాఫీ కొందరికేనా..?

### ధర్మపురి, జైన, తిమ్మాపూర్ సొసైటీల్లో 702 మందికి మొండిచేయి

ధర్మపురి, జూలై 20: ధర్మపురి, జైన, తిమ్మాపూర్ సహకార సంఘాల పరిధిలో 702 మందికి సర్కారు ఎగనామం పెట్టింది. ధర్మపురి సహకార సంఘ పరిధిలో రూ.లక్షలోపు రుణాలు తీసుకున్నవారు 955 మంది ఉండగా, అందులో 544 మందికి మాఫీ జరిగింది. జైన సహకార సంఘ పరిధిలో రూ.లక్షలోపు రుణాల రైతులు 525 మంది ఉండగా, ఇక్కడ 351 మందికి మాత్రమే ఊరట లభించింది. ఇక తిమ్మాపూర్ సంఘ పరిధిలో 402 మందికి 285 మందికి మాత్రమే రుణమాఫీ జరుగడం, మొత్తంగా మూడు సంఘాల్లో మాఫీ కాని 702 మంది రైతులు కలవరపడుతున్నారు. మాఫీ ఉన్నట్టా..? లేనట్టా..? అని ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు.

### నేనేం పాపం చేసిన.. మాఫీ ఎందుకు కాలె?



మాది వెల్లుల్ల. ఎవుసం చేసుకుంట బతుకుత. నేను మెట్‌పల్లి సొసైటీలో 76 వేలు పంట లోను తీసుకున్న. కాంగ్రెస్ ప్రభుత్వం ₹2లక్షల పంట రుణం మాఫీ చేస్తమని అధికారంలోకి అచ్చింది. మొన్నటి సందే మాఫీ మొదలు పెట్టింది. అయితే ముందు రూ.లక్ష లోపు రైతులకు చేస్తమంటే సంబురపడ్డ. మొదటి దఫాలనే బాకీ తీరుతదని అనుకున్న. కానీ, రూ.లక్షలోపు మాఫీ చేసిన లిస్టులో నా పేరు లేదు. నేనేం పాపం చేసిన. అసలు నా రుణం మాఫీ అయితదా.. కాదా..? ప్రభుత్వమే చెప్పాలి. ఇచ్చిన మాట ప్రకారం నడుచుకోవాలి.

**- బంగారు అంజయ్య, వెల్లుల్ల (మెట్‌పల్లి)**

### చెప్పేదొకటి.. చేసేదొకటి



నేను రెండేండ్ల కిందట మంథనిలోని ఎస్‌బీహెచ్‌లో ₹40వేల పంట రుణం తీసుకున్న. ఇదే బ్యాంకులో నా భర్త పేరిట ₹1.60లక్షల క్రాప్ లోన్ ఉన్నది. అయితే ప్రభుత్వం ₹లక్ష దాకా మాఫీ చేసిందని తెలుసుకుని రుణమాఫీ లిస్ట్ చూసిన. అందులో నా పేరు కనిపించలేదు. ప్రభుత్వం చెప్పేదొకటి చేసేదొకటి. నా లోనే మాఫీ కాలేదు. నా భర్త పేరిట లోన్ మాఫీ అయితదా..?

**-తిరుమల, రైతు, రామకిష్టాపూర్, ముత్తారం మండలం (మంథని రూరల్)**

### రూ.15వేల బాకీ మాఫీ చేయలే



మాది రాఘవాపూర్. నా 15 గుంటల ఎవుసం భూమి పాస్‌బుక్‌ను ముత్యంపేట బ్యాంక్‌ల పెట్టి ₹15 వేల పంట రుణం తీసుకున్న. సర్కారు మొదలు ₹లక్షలోపు రుణం మాఫీ చేస్తమంటే మాఫీ అయిపోతయని సంబురపడ్డ. కానీ, నాపేరు రాలె. పట్టుమని పదిహేను వేల బాకీ కూడా మాఫీ చేయలే. అందరేమో లక్ష లోపు బాకీలు మాఫీ అయినాయి అంటుండ్రు. కానీ, నా అసోంటి పేద మహిళలకు గీ మాఫీ పైసలు రాకపాయే. ఇట్లయితే ఎట్ల? ప్రభుత్వమే నాకు న్యాయం చేయాలె.

**- కోరుదెల ఎల్లవ్వ, రైతు, రాఘవపేట (మల్లాపూర్ మండలం)**



## మొలకెత్తిన ఆశలు

ఈ యేడాది తొలకరి పలకరించగానే రైతులు పత్తి విత్తనాలు విత్తారు. అవి మొలకెత్తే దశలో వర్షం ముఖం చాటేయడంతో ఆందోళన చెందారు. కాగా, ఇటీవల కురుస్తున్న కొద్దిపాటి వర్షాలకు పత్తి మొలకెత్తడంతో రైతుల ఆశలు చిగురిస్తున్నాయి. ఇప్పుడిప్పుడే పత్తి చేనులో మొక్కలు ఎదుగుతుండగా, హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

**- ఫొటోగ్రాఫర్, రాజన్నసిరిసిల్ల**

## వ్యవసాయబావిలో నక్కలు

రక్షించిన అటవీ అధికారులు

కథలాపూర్, జూలై 20: ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడ్డ నక్కలను అటవీశాఖ అధికారులు రక్షించారు. కథలాపూర్ మండలం బొమ్మెన శివారులోని తుర్తి నవీన్‌కు చెందిన వ్యవసాయబావిలో రెండు నక్కలు పడిపోయాయి. శుక్రవారం రాత్రి అటుగా వెళ్లిన రైతులు గుర్తించి నవీన్‌కు తెలిపారు. ఆయన అటవీశాఖ అధికారులకు సమాచారమివ్వగా.. శనివారం ఉదయం ఏఎఫ్‌ఏవో ఎండీ ముషిరొద్దీన్, ఎఫ్‌బీవో మధు బావి వద్దకు చేరుకున్నారు. రైతుల సహకారంతో వలలు వేసి నక్కలను వెలికితీశారు. అనంతరం సమీపంలోని అడవిలో వదిలిపెట్టారు.



వల నుంచి నక్కలను బయటకు తీస్తున్న అటవీశాఖ అధికారి

# వదలని ముసురు

### ఉమ్మడి జిల్లాలో గెరువియ్యని వాన

**జిల్లాను ముసురు పట్టేసింది. వానల కోసం ఎదురు చూసిన రైతన్నకు ఆనందాన్ని ఇస్తున్నది. శుక్రవారం రాత్రి మొదలై శనివారం సాయంత్రమైనా గెరువియ్యకుండా పడుతుండగా, ఇన్నాళ్లు బోసిపోయి కనిపించిన చెరువులు కుంటలకు జలకళ వస్తున్నది. పలుచోట్ల అలుగు కూడా దూకుతూ సాగుకు భరోసా ఇస్తుండగా, మరోవైపు ప్రాజెక్టులకు జలకళవస్తున్నది. సిరిసిల్లలోని ఎస్సారార్ రిజర్వాయర్‌కు స్వల్ప ఇన్‌ఫ్లో మొదలుకాగా, ధర్మపురి వద్ద గోదావరి ఉధృతి పెరిగింది. మొత్తంగా నెలరోజులుగా జాడలేని వరుణుడు కరుణించడంతో రైతాంగం పొలం బాటపడుతున్నది.**

**- కార్పొరేషన్/ శంకరపట్నం, జూలై 20**



సుల్తానాబాద్ రూరల్: నీరుకుల్ల వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న మానేరు వాగును పరిశీలిస్తున్న ఎస్ఐ

కరీంనగర్ ఉమ్మడి జిల్లాను ముసురువదలడం లేదు. రెండ్రోజులుగా తెరిపిలేకుండా కురుస్తూనే ఉన్నది. దీంతో చెరువులు, కుంటలు జళకళ సంతరించుకోగా, రైతులు సంతోషంగా సాగుకు కదులుతున్నారు. వర్షానికి పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని శాంతినగర్ ఎస్సారెస్పీ కాలువ పక్కన ఇల్లు కూలిపోగా, బాధితులను మున్సిపల్ సిబ్బంది పెద్దపల్లిలోని పునరావాస కేంద్రానికి తరలించారు. అత్యవసర సాయానికి పెద్దపల్లి పట్టణ ప్రజల కోసం మున్సిపల్ హెల్ప్ లైన్ 6303127484కు ఫోన్ చేయాలని కమిషనర్ ఆకుల వెంకటేశం సూచించారు. కరీంనగర్‌లోని గోదాం గడ్డలో శిథిలావస్థకు చేరిన అజ్జూ అనే వ్యక్తి సంబంధించిన పెంకుటిల్లు పైకప్పు కూలిపోయింది. ఇంట్లోనివారు అప్రమత్తంగా ఉండడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు. అయితే ఎక్కడ ఎలాంటి పరిస్థితులు వచ్చినా ఎదుర్కొనేందుకు కరీంనగర్ నగరపాలక సంస్థ డీఆర్‌ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచింది. వరుస వర్షాలతో జగిత్యాల జిల్లాకు వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఈ క్రమంలో జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ అశోక్ కుమార్ సూచించారు. శనివారం జిల్లాలోని పోలీస్ అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. చెరువుల వద్ద, వాగుల వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాల్సిందిగా సూచించారు. అత్యవసర సాయానికి ప్రజలు డయల్ 100కు ఫోన్‌చేయాలని సూచించారు.



ధర్మపురి: గోదావరి వద్ద కలెక్టర్ సత్యప్రసాద్



శంకరపట్నం: మత్తడి దుంకుతున్న ముత్తారం రామసముద్రం చెరువు

### గోదావరి ఉధృతి.. ప్రాజెక్టులకు జలకళ

ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో ధర్మపురి వద్ద గోదావరి నది వరద ఉధృతి పెరిగింది. ఈ క్రమంలో ధర్మపురి, రాయపట్నం వద్ద నది ఉధృతిని కలెక్టర్ సత్యప్రసాద్ పరిశీలించారు. స్నానాలకు వచ్చే భక్తులను లోతు ప్రాంతాలకు వెళ్లకుండా పోలీసులు, రెవెన్యూ, దేవస్థానం సిబ్బం ది అప్రమత్తం చేశారు. ఇక ఎగువన ఎస్సారెస్పీ, కడెం నుంచి పెద్దపల్లి జిల్లాలోని ఎల్లంపల్లికి 8942క్యూసెక్కుల వరద వస్తున్నది. ప్రాజెక్టులో 20.17టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యానికి గాను ప్రస్తుతం 5.88టీఎంసీల నీరు నిల్వ ఉంది. మంథని మండలం సిరిపురంలోని పార్వతీ బరాజ్‌కు 1835 క్యూసెక్కుల నీరు వస్తుండగా, 74 గేట్లను పూర్తిగా ఎత్తి దిగువకు వదులుతున్నారు. అలాగే సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం మాన్వాడ ఎస్సారార్ జలాశయానికి 236 క్యూసెక్కుల స్వల్ప ఇన్‌ఫ్లో వస్తున్నది. డ్యాంలో 27.54 టీఎంసీల సామర్థ్యానికిగాను ప్రస్తుతం 5.57 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు తెలిపారు. పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ మండలం గుండారం రిజర్వాయర్ మత్తడి దూకుతున్నది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 12 అడుగులకు చేరి కనువిందు చేస్తున్నది. వర్షాలకు కరీంనగర్ కేశవపట్నం నుంచి అర్కండ్ల వరకు వాగుపై నిర్మించిన చెక్ డ్యాంలలోకి నీరు చేరుతోంది. కాగా ఏడాదిలో 8 నెలల పాటు జలకళ ఉట్టి పడే ముత్తారం రామసముద్రం చెరువు నిండి మత్తడి పారుతున్నది.